క్లుప్తంగా

బీజామృతం తయారీ



బీజామృతం తయారీపై అవగాహన

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతం తయారీపై బర్లిలో రైతులకు ఐసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు బుధవారం అవగాహన కల్పించారు. రెండు మహిళా సంఘాలకు చెందిన రైతులచే 100లీటర్ల బీజామృతం తయారీ చేయించారు. రైతులు బీజామృతాన్ని వినియోగించి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇంకుడుగుంతల నిర్మాణం



వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతానగరం: ఉపాధి నిధులతో మంజూరు చేసిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. పెదబోగిలి గ్రామంలో జరుగుతున్న ఇంకుడుగుంతల నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భంలో నీటి నిల్వలు పెంచడానికి ప్రతి ఇంటి ముందు, వెనుకనున్న ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు తీయాలని సూచించారు. ఉపాధి వేతనదారుల మస్తరును పరిశీలించి, గుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు.

క్రాస్ కంట్రీ పరుగు పందెంలో సతీష్ ప్రతిభ



సతీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉషశ్రీ తదితరులు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి వాకాడ సతీష్ క్రాస్ కంట్రీ పరుగు పందెంలో ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా సెలక్షన్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ బుధవారం తెలిపారు. ఈ నెల 29న అరకు వ్యాలీలో జరిగిన క్రాస్ కంట్రీ పరుగు పందెంలో కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సతీష్ బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడని తెలిపారు. బ్రాంజ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌లను పొందడంతో పాటు ఆల్ ఇండియా సెలక్షన్‌కు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. సతీష్‌ను ప్రిన్సిపాల్, పీడీ శివాజీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు



ఎక్సైజ్ సీఐ పద్మావతి

సీతానగరం: మద్యం విక్రయాల్లో భాగంగా గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించరాదని, అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ డి.పద్మావతి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీతానగరం సర్కిల్ పరిధిలో గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాలు ఉన్నాయన్నారు. ఆయా మండలాల్లో బెల్ట్ షాపులు నిర్వహించరాదని హెచ్చరించారు. ఎవరైనా బెల్ట్ షాపులు పెడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయ బెల్ట్ షాపులు నిర్వహించినట్టు తెలిస్తే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. దుకాణాలు సోదాలు చేసే సమయంలో యజమానులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్

సీతానగరం: మండలంలోని నీటి వనరులున్న మెట్ట ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న జీడి, మామిడి తోటల పెంపకంలో మెలకువలు పాటించినపుడే అధిక దిగుబడులు, నాణ్యమైన పంటలు వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం సమకూర్చిన మెట్ట భూముల్లో తాన్నసీతారాంపురంలో వేసిన జీడిమామిడి తోటల పెంపకందారులతో ఏఓ అవినాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ పంట సాగుల్లో మెలకువలు పాటించని పక్షంలో పంట దిగుబడి తగ్గి నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ అవినాష్ తెలిపారు. రైతులు, వ్యవసాయ సహాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ముక్కు మూసుకోవాల్సిందే...

పాచిపెంట మండలం నుంచి జీగిరాం మీదుగా సాలూరుకు వెళ్లాలంటే జీగిరాం ఎత్తుఖానా దిగిన తరువాత ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే.. సాలూరు బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న డంపింగ్ యార్డు వద్ద మున్సిపాలిటీ నుంచి సేకరిస్తున్న చెత్త కాల్చడంతో పొగ తీవ్రంగా వెలువడి కళ్లు కూడా మండిపోతున్నాయి. పట్టణంలో ఎక్కడికక్కడే చెత్త కుప్పలతో కంపు కొడుతోంది. ఓ వైపు చెత్త కుప్పల నుంచి వెలువడే దుర్గంధం, మరోవైపు కాల్చే చెత్త కుప్పల నుంచి వెలువడే పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వీటితో అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాలూరు



స్పందించారు...

ప్రమాదకరంగా బైపాస్ రహదారి శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన వార్తకు పోలీసు సిబ్బంది స్పందించారు. పార్వతీపురం పట్టణ సీఐ నారాయణరావు స్పందించి రహదారిపై గోతులను పూడ్చి వేయించారు. ట్రాఫిక్ ఎస్ఐ పాపయ్య తదితరులు దగ్గరుండి గోతులు పూడ్చి వేయించారు. అయితే స్పందించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విమర్శిస్తున్నారు. – పార్వతీపురం టౌన్



ఆదమరిస్తే అంతే..

పార్వతీపురం – పాలకొండ రహదారిలో నవిరి జంక్షన్, కోటవానివలస జంక్షన్, అడ్డాపుశీల జంక్షన్ వద్ద రహదారి అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడే పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదు. ఈ మార్గంలో వర్షం పడితే పాదచారులు సైతం ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు రోజూ ఇలానే ప్రయాణం సాగిస్తున్నా పట్టించుకోవడం లేదు. – పార్వతీపురం

మంత్రి ఇలాకాలో..

అటకెక్కిన గిరిజన విద్య!

అది గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గం. కానీ అక్కడ గిరిజన విద్యార్థుల చదువులు అటకెక్కాయి. తెల్లారితే గిరిజన సంక్షేమానికి, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కథలు చెప్పే ఆమె.. సొంత నియోజకవర్గంలో గిరిజన విద్యార్థుల విద్యా స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలైంది. కానీ.. సాలూరు నియోజకవర్గంలో గిరిజన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన జీపీఎస్ పాఠశాలలు నేటికీ ప్రారంభం కాలేదు. దీంతో ఆయా పాఠశాలల్లో గత ఏడాది చదివిన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే పరిస్థితి లేక ఆటలతో కాలం గడిపేస్తున్నారు. మంత్రిగారూ.. ఒక్కసారి మా పాఠశాలల వైపు చూడండి.. అంటూ ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఇప్పటికీ నియామకం కాని ఉపాధ్యాయులు
- మా పిల్లలకు విద్యాబోధన చేయండి మహాప్రభో.. అంటున్న తల్లిదండ్రులు
- సాలూరు నియోజకవర్గంలో గిరిజన విద్యార్థుల దుస్థితి



పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న పిల్లలు



తెరుచుకోని బొడ్డపాడు జీపీఎస్ పాఠశాల

సాలూరు రూరల్/పాచిపెంట:

పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. స్వయానా.. గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మరి ఇతర ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల విద్యా పరిస్థితి ఎలా ఉందో వేరే చెప్పక్కర్లేదు...

సాలూరు నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట మండలాల్లో ఉన్న 13 జీపీఎస్ పాఠశాలలు విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడిచినా నేటికీ తెరుచుకోలేదు. సాలూరు మండలంలో బందపాయి, బొడ్డపాడు, బింగుడువలస గ్రామాల్లోని పాఠశాలల్లో 15 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలు తెరుచుకోకపోవడంతో పిల్లలు పాఠశాల ఆవరణల్లోనే ఆటలాడుతూ కాలం గడిపేస్తున్నారు. పాచిపెంట మండలంలో కొండకరకవలస, ధూళిభద్ర, గరిసిగుడ్డి, కాగులమామిడి, కుమ్మరిచోల, కొండలుద్దండి, మిళియా కంచూరు, పాలంవలస, చార్లపాడు, గుమ్మిడివలస గ్రామాల్లో జీపీఎస్ పాఠశాలలు నేటికీ తెరవలేదు. ఈ పాఠశాలల్లో 63 మంది విద్యార్థులు ఉండగా వీరంతా ఖాళీగా కాలం గడిపేస్తున్నారు. ఇప్పటికే ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలైనా పాఠశాలలు తెరవకపోవడంతో మా పిల్లల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన శాఖ మంత్రి ఇలాఖాలోనే పరిస్థితి ఇలా ఉంటే... మిగతా ప్రాంతాల్లో గిరిజన విద్యాభివృద్ధి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. తమ పిల్లలు ఏ తరగతి చదువుతున్నారో కూడా తెలియని పరిస్థితి తల్లిదండ్రుల్లో నెలకొంది. విద్యార్థులు కూడా ఏం చదువుతున్నారంటే చెప్పలేకపోతున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా జీపీఎస్ పాఠశాలలు వెంటనే తెరవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గాలికొదిలేసారు...



మా పిల్లల చదువులు గాలికొదిలేసారు. గిరిజన విద్యార్థులంటే అందరికీ చిన్నచూపే.. ప్రతి రోజూ పాఠశాలకు పిల్లలు వెళ్లి వస్తున్నారు. పాఠశాల మాత్రం తెరవడం లేదు. రోజూ ఉపాధ్యాయులొచ్చి.. పాఠశాల తలుపులు తెరచి చదువు చెబుతారని ఆశతో మా పిల్లలను పాఠశాలలకు పంపుతున్నాం. కానీ ఇప్పటివరకు ఎవరూ రాలేదు. పాఠశాల తలుపులు తెరుచుకోలేదు.

– సీదరపు చల్లమ్మ, బొడ్డపాడు, సాలూరు మండలం

మంత్రి గారూ.. ఓసారి ఇటు చూద్దురూ..



గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి మా పిల్లల పాఠశాలలు తెరిచేలా చూడాలి. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలైంది. మరో ఆరు నెలల్లో పాఠశాలల విద్యా సంవత్సరం ముగుస్తుంది. మరి మా పిల్లలకు ఎప్పుడు చదువులు చెబుతారు. ఎలా తీర్చిదిద్దబడతారు. మంత్రి గారూ...ఓసారి మా పిల్లల పరిస్థితిని చూడండి. జీపీఎస్ పాఠశాలలను తెరిపించి చదువులు చెప్పించండి.

– ఎస్.సుబ్బారావు, బొడ్డపాడు, సాలూరు మండలం

పీఎంఈజీపీని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్



లబ్ధిదారుకు మారుతి కారు తాళాలను అందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పీఎంఈజీపీ పథకంలో మంజూరైన మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారు తాళాలను లబ్ధిదారుడు మీసాల రాహుల్‌కు కలెక్టర్ బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకు పలు పథకాలను 30 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. ఎంఆర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ పేరిట లబ్ధిదారు పొందిన కారు ఖరీదు రూ.9,11,488లు కాగా లబ్ధిదారుడు రూ.51,488లు చెల్లిస్తే, రూ.3,19,021లు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, మిగిలిన మొత్తం బ్యాంకు రుణం మంజూరు చేస్తుందన్నారు. జిల్లా అధికారులు పలువురు పాల్గొన్నారు.

ధనలక్ష్మికి కుంకుమ పూజలు



పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి చదురు గుడిలో ఈఓ వి.వి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ధనలక్ష్మికి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆశ్వీయుజ ధన త్రయోదశి పర్వదినం సందర్భంగా సకల జనుల లోకకళ్యాణార్థం, మహాలక్ష్మి ధన ధాన్య, ధనలక్ష్మి కుంకుమ పూజను అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా అర్చకులు కప్పగంతుల శ్రీనివాసశర్మ నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న వీఆర్‌ఏలు

బలిజిపేట: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల వీఆర్‌ఏలు తహసీల్దార్ రత్నకుమారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. రాత్రి విధులు, ఇసుక రీచ్‌ల వద్ద డ్యూటీలు వేయరాదని కోరారు. వీఆర్‌ఏల సంఘ నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయం చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో డ్యూటీలు వేయరాదని, ఇసుక రీచ్‌ల వద్ద విధులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను రద్దు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా టీఏ, డీఏలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాబూరావు, శ్రీను, నక్షత్రమ్మ, రవి పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: తహశీల్దార్ జయకు వినతిపత్రం అందజేత

పార్వతీపురం టౌన్: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయకు ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (వీఆర్‌ఏ) మండల కమిటీతో కలసి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె.విజయ్‌కుమార్, ఎస్.కేశవరావు, జె.శివ, కె.నిర్మల, ఆర్.కొండలరావు, డి.రవి, సీఐటీయూ పట్టణ నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంగళరాయిసాగర్‌లో చేప పిల్లల విడుదల



చేపపిల్లలు విడిచిపెడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: మండలంలోని వెంగళరాయసాగర్ జలాశయంలో గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి 3 లక్షల చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యకారులకు సూచించారు. మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి మాట్లాడుతూ ఎనిమిది గ్రామాలకు చెందిన 413 మంది మత్స్యకారులు ఈ జలాశయంలో చేపల వేట సాగిస్తూ జీవిస్తున్నారన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య పాల్గొన్నారు.

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్‌లోకి బుధవారం చేప పిల్లలను గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి విడిచిపెట్టారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన 2024 – 25 పథకంలో భాగంగా 40శాతం లబ్ధిదారుల వాటా కింద ప్రభుత్వ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం విజయనగరం ఆధ్వర్యంలో చేపపిల్లలు విడిచిపెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. సాలూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎల్లేటి శ్రీదేవి, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలంలోని శంబర గ్రామంలో రూ.2.40కోట్ల తో సీసీ రోడ్లు నిర్మాణానికి మంత్రి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. ఎస్.పెద్దవలస పంచాయతీ వీరాడవలస గ్రామం నుండి కవిరివలస గ్రామం వరకు రూ.2 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాశీపట్నం గ్రామంలో రూ.54 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి మంత్రి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు.

శ్యామలాంబ పండగకు పక్కా ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

సాలూరు:

పట్టణంలో వచ్చే ఏడాది జరగనున్న శ్యామలాంబ పండగకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లె వెంకటరమణ కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల బదలాయింపునకు 0.1శాతం, క్రయ విక్రయాలకు సంబంధించి ఆస్తుల బదలాయింపునకు 0.5శాతం రుసుం చెల్లించాలని సభ్యులు నిర్ణయించారు. గతంలో ఈ రుసుంలు ఒక శాతం ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుందని, వీటిని తగ్గించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించింది. సుమారు రూ.50లక్షలతో కొనుగోలు చేసిన వాహనాలు నిరుపయోగంగా ఉన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ కోసం జేసీబీ తదితర వాహనాలు కొనుగోలు చేశారని, వాటికి డ్రైవర్లను ఎందుకు నియమించలేదని సభ్యులు రఘు, వెంకటరమణ తదితరులు ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. పలు అంశాలపై సభ్యులు చర్చించారు. వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లె జగన్‌మోహనరావు, కౌన్సిలర్లు బి.హైమావతి, ఎం.సరోజిని, కృష్ణారావు, ఈశ్వరరావు, వరప్రసాద్, నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఏనుగులను తక్షణమే తరలించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మోహనరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను తక్షణమే తరలించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన మోహనరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ఏనుగులు సంచరిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం కలిగిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. అటవీ శాఖ అధికారులు ఎంత అప్రమత్తం చేస్తున్నా గజరాజులు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రాణాలను గుప్పెట్లో జీవిస్తున్నారని తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు తెల్ల గౌరీశంకర్, రవికుమార్, నారాయణరావు, భాస్కరరావు ఉన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడాలి



కోరన్న, మంగన్న వర్ధంతి సభలో పాల్గొన్న గిరిజనులు

పార్వతీపురం టౌన్: గిరిజన హక్కుల కోసం నిరంతరం పోరాడి ప్రాణ త్యాగం చేసిన కోరన్న, మంగన్నలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాస్కరరావు అన్నారు. ఆయన అధ్యక్షతన పార్వతీపురం మండలం సీతంపేట గ్రామంలో కోరన్న, మంగన్న వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరన్న, మంగన్నలు గిరిజనుల హక్కుల కోసం, ప్రత్యేక చట్టాల కోసం పోరాడి అమరులయ్యారన్నారు. వారి పోరాటాల ఫలితంగా గిరిజనుల హక్కులు, చట్టాలు సాధించుకున్నామన్నారు. ఇప్పుడు అనుభవిస్తున్న 1/70, పీసా చట్టం 2005లో వచ్చిన అటవీ హక్కుల చట్టం, ఉద్యోగ రిజర్వేషన్లు ఇలా గిరిజన చట్టాలు చాలానే సాధించుకున్నామని అన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టాలను కాలగర్భంలో కలిపే ప్రయత్నాలు చేస్తుందన్నారు. అమరవీరుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని మనం సాధించుకున్న చట్టాలను కాపాడుకునే దిశగా ప్రతి గిరిజనుడు పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాలు, శ్రీనునాయుడు, వెంకటస్వామి, మన్నారావు,సీపీఎం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.